క్లుప్తంగా

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా పుణ్యమ్మ



మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి ఐకేపీ మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా పుణ్యమ్మ ఎన్నికైనట్లు ఏపీఎం సంగమేశ్వర్ తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా కౌడిపల్లి, నర్సాపూర్, కొల్చారం ఏపీఎంలు సంగమేశ్వర్, గౌరీశంకర్, సునీల వ్యవహరించారు. నూతన అధ్యక్షురాలిగా పుణ్యమ్మ(కంచన్‌పల్లి), కార్యదర్శిగా రాధిక(కౌడిపల్లి), కోశాధికారిగా లత(వెల్మకన్న) ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నికైనట్లు తెలిపారు. రెండేళ్లపాటు వీరి పదవీకాలం ఉంటుందన్నారు. ఇంతకు ముందున్న కార్యవర్గం పదవీకాలం పూర్తి కావడంతో గ్రామ, మండల స్థాయిలో నూతన కార్యవర్గాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు నాగరాజు, రమేశ్, శ్రీకాంత్, దుర్గయ్య, పురుషోత్తం, వివిధ గ్రామాల సమాఖ్య అధ్యక్షులు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



అక్రమ నిర్మాణం తొలగిస్తున్న సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రామాయపల్లి గ్రామంలో మురికి కాల్వపై అక్రమ నిర్మాణం చేపట్టగా తహసీల్దార్ మన్నన్ ఆధ్వర్యంలో తొలగించారు. సోమవారం మండలంలోని శాలిపేట మధిర గ్రామమైన రామాయపల్లి గ్రామంలో ఇంటి నిర్మాణంలో భాగంగా మురికి కాల్వపై పునాది నిర్మించగా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ పరిశీలించి తొలగింపజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో



రెడ్డిపల్లి ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్..

అల్లాదుర్గం(మెదక్): మొక్కంటే లెక్క లేదు అనే శీర్షికతో ఆదివారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం చిల్వెర, రెడ్డిపల్లి, మందాపూర్ గ్రామాల్లో నర్సరీలను, ఉపాధి హామీ పనులు పరిశీలించారు. మందాపూర్ గ్రామంలో నర్సరీ నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



మదూర్‌లో ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ మన్నన్ ఆదేశించారు. మండలంలోని అంబాజిపేట, మిర్జాపల్లి, మదూర్, శాలిపేట గ్రామాలలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంటాచేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. అకాల వర్షాలు పడుతున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని పలు గ్రామాల బాధితులకు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 11 మందికి రూ.6.56 లక్షల విలువజేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నవీన్, నాయకులు వెంగళ్‌రావు, శ్రీనివాస్, శ్రీకాంత్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

వసూళ్లు సరే.. వసతులేవి?

వారంతపు సంతల్లో కనీస వసతులు కరువయ్యాయి. అధికారులు తైబజార్ ద్వారా ఆదాయం పొందుతున్నా మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలం అయ్యారు. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– శివ్వంపేట(నర్సాపూర్)

- సమస్యల వలయంలో వారంతపు సంతలు
- టాయిలెట్లు, తాగునీరు కరువు
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, కొనుగోలుదారులు



శివ్వంపేటలో జరుగుతున్న వారంతపు సంత

మండల కేంద్రమైన శివ్వంపేటలో గతంలో గురువారం వారంతపు సంత నిర్వహించగా కొన్నేళ్ల క్రితం మూతపడిపోయింది. రెండేళ్ల క్రితం అప్పటి జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ కృషితో తూప్రాన్- నర్సాపూర్ ప్రధాన హైవేకు పక్కన ప్రజలకు అనువుగా ఉండే ప్రదేశంలో మార్కెట్ నిర్మాణం చేపట్టారు. ప్రతి బుధవారం వారంతపు సంత జరిగేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం గ్రామస్తులే కాకుండా వివిధ గ్రామాల నుంచి వస్తున్న ప్రజలతో సంత జోరుగా సాగుతోంది. అయితే టాయిలెట్స్, తాగునీరు. ఇతర వసతులు లేకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని కొత్తపేట చౌరస్తా (రూప్లతండా)వద్ద శుక్రవారం, గోమారంలో శనివారం వారంతపు సంతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సైతం వసతులు కల్పించడంలో సంబంధిత పంచాయతీ సిబ్బంది పూర్తిగా విఫలం అయ్యారు. గోమారంలో మార్కెట్ నిర్మాణం కోసం గతంలో రూ. 10 లక్షలు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. అయితే నిధులు సరిపోకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. మరిన్ని నిధులు మంజూరు చేస్తే మార్కెట్ పూర్తిస్థాయిలో పూర్తవుతుంది. అదనపు నిధుల మంజూరుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తైబజార్ ద్వారా ఆదాయం

మండలంలో జరుగుతున్న వారంతపు సంతలకు గ్రామ పంచాయతీలకు తైబజార్ ద్వారా ఆదాయం వస్తుంది. ఈ సంవత్సరం తైబజార్ వేలం పాట నిర్వహించగా శివ్వంపేట రూ. 3,42,000, గోమారం రూ. లక్షా 28 వేలు, కొత్తపేట చౌరస్తా రూప్లతండా రూ. 77 వేల ఆదాయం వచ్చింది.

చర్యలు తీసుకుంటాం

వారంతపు సంతల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. టాయిలెట్ల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు ఉపయోగించుకునేందుకు అవకాశం ఉంది. నిర్మాణాలకు అనువైన స్థలం ఉంటే పనులు చేపడతాం. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి వసతుల కోసం తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– సాయిబాబా
డీఎల్‌పీఓ

వసతులు కల్పించాలి



ప్రస్తుతం వేసవికాలం కావడంతో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం. టాయిలెట్స్ లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

– సత్తెమ్మ,
కూరగాయల వ్యాపారి, శివ్వంపేట

మనమహోత్సం నాటికి సిద్ధంకండి

ఎంపీడీఓ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): మనమహోత్సం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని, నర్సరీలలో మొక్కలు ఏపుగా పెరిగేటట్లు చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్ ఆదేశించారు. తన కార్యాలయంలో ఆయన సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్యలేకుండా చూడాలని సూచించారు. కౌడిపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించాలని కోరారు. 400 నుంచి 600 ఫీట్ల విస్తీర్ణంలో మాత్రమే ఇల్లు నిర్మించాలని, అంతకంటే ఎక్కువ స్థలంలో నిర్మిస్తే బిల్లులు రావని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్వరగా అన్‌లోడింగ్ చేయాలి



రైస్‌మిల్లు వద్ద అన్‌లోడింగ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యం లారీలను త్వరగా అన్‌లోడింగ్ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ షఫిఉద్దీన్ సూచించారు. సోమవారం పలు కొనుగోలు కేంద్రాలతోపాటు రైస్‌మిల్లులో అన్‌లోడింగ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. కేంద్రాలలో ధాన్యం నిల్వలతో రైతులు ఆందోళన పడుతున్నారని, ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రం నిర్వాహకులపై ఉందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి నిత్యం ధాన్యం తరలించేందుకు లారీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మధు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

- రూ.3.35 కోట్లతో అంచనాలు
- 24 దుకాణాల సముదాయం నిర్మించేందుకు నిర్ణయం



జహీరాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్

జహీరాబాద్: పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా దుకాణాల సముదాయాన్ని నిర్మించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రతిపాదించారు. ఏడాది క్రితం ప్రతిపాదించినా పలు మార్పులతో తాజాగా ప్రతిపాదనలు పంపారు. యార్డు మధ్యలో ఉన్న రెండు గోడౌన్‌లు శిథిలంగా మారడంతో వాటిని కూల్చివేసి ఎల్ ఆకారంలో దుకాణాల సముదాయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందుకు రూ.3.35కోట్లు కావాల్సి వస్తుందని అంచనా వేశారు. ఈ నిధులతో 24 దుకాణాల సముదాయాన్ని నిర్మిం చేందుకు నిర్ణయించారు. ప్రస్తుతం యార్డు చుట్టు ఉన్న దుకాణాలన్నీ ప్రైవేటు వ్యక్తులకు చెందినవే. రహదారి పక్కన ఉన్న చిన్న దుకాణాలను వ్యాపారులకు అద్దెలకు ఇచ్చారు. యార్డులో కొత్తగా దుకాణాల సముదాయాన్ని నిర్మించడం వల్ల కమీషన్ ఏజెంట్లకు అద్దెలకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోనున్నారు. అంతేకాకుండా రైతులకు, వ్యాపారులకు సైతం సౌలభ్యం కానుంది. రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తీసుకువస్తే కొత్తగా నిర్మించనున్న దుకాణాల సముదాయం ముందు ఆరబెట్టుకునేందుకు కూడా అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి తూర్పు, దక్షిణం వైపున దుకాణాలను నిర్మించనున్నారు. వారం రోజుల క్రితం నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు మార్కెట్ కార్యదర్శి ఎ.చంద్రశేఖర్ పేర్కొన్నారు. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

సుందరయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హవేళీఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళీఘణాపూర్‌లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో దశరథ్, శంకర్, రాజయ్య, సిద్ధిరాములు, నారాయణ, దుర్గా, శంకర్, యశోద తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

వెల్దుర్తి(తూప్రాన్) : ఉద్యమమే ఊపిరిగా పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని వెల్దుర్తి, మాసాయిపేట మండల కేంద్రాల్లో సోమవారం సీపీఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుందరయ్య చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో గౌరి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉర్సు ఉత్సవాలు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన టేక్మాల్‌లో హజ్రత్ సయ్యద్ బుర్హానుద్దీన్ ఔలియా రహ్మతుల్లాహి అలై ఉర్సు ఉత్సవాలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా మైనార్టీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ సలీమ్ సోమవారం తెలిపారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా అఖిల భారత జామ్యాతుల్ మషాయఖ్ అధ్యక్షులు హజ్రాత్ సయ్యద్ షా అహ్మద్ నూరుల్లా హాసిని హుసేని ఖాద్రి, అఖిల భారత తన్జీమే ఇస్లాహె మాషెర అధ్యక్షులు మౌలానా హమీద్ రహ్మనీ మౌలానా సయ్యద్ లియాఖతుల్లా హుస్సైనీ, మౌలానా ఫరూక్ అజీజ్, మౌలానా శౌకత్ రజా, సయ్యద్ ముజీబ్, మౌలానా వాజిద్ పాషా లతోపాటు ప్రసిద్ధి చెందిన గురువులు వచ్చి సోఫి సిద్ధాంతులను వివరిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ పంట నష్టతీవ్రత అంచనా

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని పలు గ్రామాలలో గిర్దావర్ ధన్‌సింగ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహులు సందర్శించి నష్ట తీవ్రతపై అంచనా వేశారు. రెండు రోజుల క్రితం ఈదురుగాలులతో కూడిన వర్షానికి ధ్వంసమైన మూడు నివాస గృహాలను, గ్రామ శివారులోని పీఏసీఎస్ గోదాంను సోమవారం వారు పరిశీలించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించడానికి తనవంతు కృషి చేస్తామని చెప్పారు.

◆ బాధిత కుటుంబానికి ఆపన్న హస్తం



రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్ గ్రామానికి చెందిన మెతుకు దత్తు కుటుంబానికి కాంగ్రెస్ నేత త్రిష సోమవారం అండగా నిలిచారు. రాజనర్సింహ ఫౌండేషన్ ద్వారా దత్తుకు రూ.30 వేలు కాంగ్రెస్ పార్టీ నాయకులతో పంపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి, పార్టీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్‌గుప్తా, కో ఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ భస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

కౌడిపల్లి(నర్సాపూర్): వృత్తినైపుణ్యం పెంపొందించడంలో భాగంగా ఈ నెల 20నుంచి 24 వరకు కౌడిపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఉ.9 నుంచి సా.5గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాలరాజు సోమవారం తెలిపారు. శిక్షణలో మండలంలోని 103మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని చెప్పారు. గణితం, ఇంగ్లీష్, తెలుగు, జనరల్ అంశాలపై రిసోర్స్ పర్సన్‌లు స్రవంతి, రమేష్, మల్లేశం, నవాజొద్దీన్, మహిపాల్, మహేశ్, చందర్‌రెడ్డి, గోవింద్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

◆ ఉత్సాహంగా బండ్ల ఊరేగింపు



పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్‌లో మానిక్‌ప్రభు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ఊరేగింపును భాజాభజంత్రీలు, డప్పుచప్పుళ్లు, యువకుల నృత్యాల మధ్య ఊరేగించారు. మంగళవారం కుస్తీపోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

◆ హనుమాన్ జయంతికి ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవస్థానం అధ్యక్షుడు మనోహర్, కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ అంజిరెడ్డిని కలిసి 22న జరిగే హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ గుప్తా, విరూపాక్ష, కంకర్ శ్రీను, విజయ్, ప్రసాద్ రమేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

మెదక్ కలెక్టరేట్: తొలగించిన మహనీయుల విగ్రహాలతో పాటు అంబేద్కర్ భవన నిర్మాణం వెంటనే చేపట్టాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. అంతకుముందు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఐదేళ్ల క్రితం రాందాస్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్ ప్రాంతంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాంల విగ్రహాలను తొలగించినట్లు తెలిపారు. గతంలోనే జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు, స్థలం మంజూరైనప్పటికీ ఆ పనులు ముందుకుసాగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే మహనీయుల విగ్రహాలు, అంబేద్కర్ భవన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మాసాయిపేట యాదగిరి, అశోక్, మురళి, బాల్‌రాజ్, దుబ్బాల సంజీవులు, గోపాల్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మల్లేశం, పాతూరి రాజు, కొండిస్వామి, దండొల్ల సామి, బుర్ర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న హనుమాన్ మాలధారులు



స్వామివారికి స్వీట్లు, వంటకాలతో నైవేద్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికిలో హనుమాన్ మాలధారులు సోమవారం ఆంజనేయ స్వామికి 56 రకాల స్వీట్లు, వంటకాలతో ప్రత్యేకంగా నైవేద్యం సమర్పించారు. ఉదయం పురోహితుడు బాపుశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి చందన అలంకరణ చేసి హనుమాన్ చాలీసా పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఎస్‌ఐ శివానందం



మాట్లాడుతున్న ఎస్‌ఐ శివానందం, చిత్రంలో ఎంఈఓ సత్యనారాయణ

తూప్రాన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్‌ఐ శివానందం పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివితే సమాజంలో గుర్తింపుతో పాటు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో ఆశలతో కష్టాలను ఓర్చుకుంటూ చదివిస్తారని అన్నారు. తల్లిదండ్రుల కలలను నిజం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇందుకు అందివచ్చిన ప్రతి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, శిక్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నార్సింగిలో ఐదుగురికి మంజూరైన రూ.2.19 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పలు పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్రరెడ్డి, రాజేశ్, సంపత్‌రెడ్డి, బాచిస్వామి, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్డి పెద్దచెరువు కబ్జాపై విచారణ



కబ్జా ప్రదేశం పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి పెద్ద చెరువు కబ్జాపై తహసీల్దార్ శివశ్రీనివాస్ సోమవారం విచారణ చేపట్టారు. నీటిపారుదల శాఖ ఏఈ అలేఖ్యరెడ్డితో కలిసి చెరువును పరిశీలించారు. పెద్దచెరువులో జేసీబీతో అడ్డుకట్టలు వేసి కబ్జా చేశారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కబ్జా చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. పట్టా భూమిని సాగు చేసేందుకు గెట్లు వేసే పనులు చేసినట్లు సంబంధిత రైతు వాదిస్తున్నారు. గ్రామస్తులు, రైతు మధ్య వివాదం చోటుచేసుకుంది. చెరువు కబ్జా జరిగిన విషయమై పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. కబ్జా చేసినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



సర్టిఫికెట్‌లను అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో పాల్గొని పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో మాజీ కౌన్సిలర్ పావని ఆధ్వర్యంలో శ్రీశక్తి మహిళా సంఘం ద్వారా మహిళలకు, చిన్నారులకు నిర్వహించిన వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి కుమారస్వామి పేర్కొన్నారు. నేటి నుంచి మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలకు చెందిన 70 మంది ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌పై ఐదురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమాజానికి విద్యార్థులే మూల స్తంభాలు



విద్యార్థునుల నృత్య ప్రదర్శన

నారాయణఖేడ్: సమాజ భవిష్యత్‌కు విద్యార్థులే మూలస్తంభాలని అఖిలభారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ అన్నారు. ఖేడ్ శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో సంస్కార సాధనావర్గ సమారోప్ పేరిట 21 రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతో పెంచాలన్నారు. శిశు నుంచి 10వ తరగతి విద్యార్థులకు వేసవిలో భారత సంస్కృతి, సంప్రదాయాలు, నీతిపద్యాలు, శ్లోకాలు, క్రీడలు, కళాత్మక విషయాలైన చిత్రలేఖనం, లీఫోర్ట్, శాస్త్రీయ నృత్యం, అభినయ గేయాలు, యోగాచాప్, డంబుల్స్, కర్రసాము, కోలాటం, చెక్కభజనలో శిక్షణ నివ్వడం అభినందనీయమన్నారు. శిక్షణనిచ్చిన స్వప్న, గుండుశివకుమార్, విద్యార్థులకు క్రీడాపరికరాలను అందజేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌ను సన్మానించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. పాఠశాల కమిటీ బాధ్యులు సాంబయ్య, నారాయణ, వీరేశలింగం, వెంకటరమణారెడ్డి, డా. అర్థం చంద్రశేఖర్, శివరాజ్, డా.రాజయ్య, వీరారెడ్డి పాల్గొన్నారు.